క్లుప్తంగా

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్యశిబిరంలో వైద్యుడు మణికంఠ 53 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి బూర్లె పిచ్చికృష్ణ దంపతులు, వారి కుమారులు ఆర్థిక సహకారం అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

శ్మశానవాటికలో ముళ్ల కంప తొలగింపు

గంజివానిపాలెం(మోపిదేవి): మోపిదేవి శివారు గంజివానిపాలెం దళితవాడ శ్మశాన వాటికలో పంచాయతీ అధికారులు ఆదివారం ముళ్లకంపు తొలగించారు. గ్రామ కార్యదర్శి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ముళ్లకంపతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు సమస్యను గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి దృష్టికి తెచ్చారన్నారు. సర్పంచ్ ఆదేశాల మేరకు పొక్లెయిన్‌తో శ్మశానవాటిక, వాటర్ ట్యాంకు వద్ద ముళ్లకంపు తొలగించామని చెప్పారు.

జెడ్పీ పాఠశాలకు వంట పాత్రలు, స్టీలు ప్లేట్ల వితరణ

మోపిదేవి: స్థానిక జెడ్పీ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు చేయూత అందించారు. పాఠశాల ఉపాధ్యాయిని వాణి నాగకుమారి రూ.10 వేలతో కొత్త వంటపాత్రలు అందించగా, మిగిలిన ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ స్పందించి 300 స్టీలు ప్లేట్లు కొనుగోలు చేసి పాఠశాలకు అందించినట్లు ప్రధానోపాధ్యాయురాలు పోలవరపు జయంతి తెలిపారు.

ప్రశాంతంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశపరీక్ష

పెడన: ఏపీయూహెచ్ఎస్, ఎన్టీఆర్ యూహెచ్ఎస్ బీఎస్సీ నర్సింగ్ ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 180 మందికి 170 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



ఘంటసాల: యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని గోగినేనిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అందించిన వివరాల మేరకు గోగినేనిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కుంపటి అనిల్ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు యువకుని స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద, వివిధ గ్రామాల్లో విచారించిన అనిల్ ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో అనిల్ తండ్రి పోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. అనిల్ ఆచూకీ తెలిస్తే ఘంటసాల పోలీస్ స్టేషన్‌కు, 94407 96472 నంబరు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పులిగడ్డలో వేగ నియంత్రణకు చర్యలు

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ సర్కిల్ వద్ద వేగ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ పులిగడ్డ సర్కిల్, పెనుమూడి వారధి, మోపిదేవి మలుపు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టిక్కర్ ఉన్న డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు, వేగాన్ని నియంత్రించేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు. లారీలు, కంటైనర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లకుండా నియంత్రణ చేసేందుకు వీటిని పెట్టామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి నిదానంగా రాకపోకలు సాగించాలని చెప్పారు.

ఆర్థిక సహాయం అందజేత

గూడూరు: నిరుపేద చేనేత వర్గానికి చెందిన ఉక్కెం భ్రమరాంబ కుటుంబానికి మేమున్నాం స్వచ్ఛంధ సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. గుండె వ్యాధి, పక్షవాతంతో బాధపడుతున్న భ్రమరాంబ పరిస్థితి తెలుసుకున్న మేమున్నాం సంస్థ ఫౌండర్ వీణం శ్రీనివాస్, పెడన ప్రభుత్వ కళాశాల లైబ్రేరియన్ పి.రవి బాధిత కుటుంబానికి ఆదివారం రూ.10వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు.

వృద్ధాశ్రమానికి చేయూత

నాగాయలంక: హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కావూరి రవీంద్రకుమార్ ఆర్థిక సౌజన్యంతో ఆదివారం స్థానిక వృద్ధుల ఆశ్రయ కేంద్రంలో వృద్ధులకు 50 కేజీల బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. దాత మాతృమూర్తి కనక సీతమ్మ 84వ జయంతి పురస్కరించుకుని ఆమె జ్ఞాపకార్థం స్నేహ సొసైటీ ప్రధాన కార్యదర్శి, పెన్ యూనియన్ నాయకుడు సామర్ల మల్లికార్జునరావు నేతృత్వంలో వీటిని ఆశ్రమ నిర్వాహకుడు తలశిల లీలామనోహర్, వృద్ధులకు అందజేశారు. పెన్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లేబాక నాగేశ్వరరావు, పసుపులేటి లక్ష్మీశ్రీనివాసరావు, గల్లా గోపాలకృష్ణ, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన సారె సంబరం



నాగాయలంకలో సారె సమర్పిస్తున్న భక్తులు



పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో గ్రామగ్రామాన ఆదివారం ఆషాఢ సారె సంబరం అంబరాన్నంటింది. భక్తులు పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, వివిధ రకాల వంటకాలను తీసుకొని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించి, సారె సమర్పించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– పెడన/కృత్తివెన్ను/నాగాయలంక/కోడూరు/చల్లపల్లి/మోపిదేవి/ఘంటసాల



నాగమ్మ తల్లికి సారెను తీసుకువచ్చిన భక్తులు



పైడమ్మ అమ్మవారికి సారెను తీసుకువెళ్తున్న భక్తులు



చల్లపల్లిలో..



విశ్వనాథపల్లిలో..

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

కోడూరు: మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మ వార్లకు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలి రావడంతో కోలాహలం నెలకొంది. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. అష్టాక్షరీ పీఠాధిపతి, ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఉదయం ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను 108 కలశాలలో ఉంచి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అష్టోతర శతకలశ క్షీరాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తమండళ్ల సభ్యులు విష్ణుసహస్రనామ పారాయణ ఏకాహాకాన్ని ఆదివారం ఉదయం భక్తిప్రపత్తులతో ప్రారంభించారు. 24 గంటల పాటు ఏకాహాకం కొనసాగుతుందని చెప్పారు. కర్నూలు, నకిరేకల్లు, బెంగళూరు, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్ నుంచి భక్తమండళ్ల సభ్యులు తరలివచ్చారు.



ఉల్లిపాలెంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అష్టాక్షరీ స్వామీజీ

వేణుగోపాలస్వామి సన్నిధిలో..

నాగాయలంక: స్థానిక శ్రీరుక్మిణీ శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక భజన మండలి సభ్యులు, గీతాసమాజం సభ్యులచే భగవద్గీత, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం గావించారు. ధర్మకర్త విశాలాక్షి పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు సత్యప్రసాద్ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగాపూజలు నిర్వహించారు. పేలాల పిండిని ప్రసాద వితరణ చేశారు. గీతా సమాజం సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెడన: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఆదివారం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అగ్నిహోత్రం హరికృష్ణ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహాశాంతి అభిషేకం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహాశాంతి అభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు దీవి అప్పలాచార్యులు, బాలకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, దీవి రఘు, అనంతాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసిన అభిషేకం జరిపించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు 1008 అరటి పండ్లతో పూజలు చేశారు. ప్రముఖ ఆడిటర్ కేతవరపు శివరామ్‌కుమార్– ఇందిరారమణి దంపతులు అరటి పండ్ల పూజ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మచిలీపట్నంటౌన్: ముస్లింల చెస్ట్ బీటింగ్(మాతమ్)తో చిందిన రక్తంతో నగర నడిబొడ్డున ఉన్న చారిత్రక కోనేరుసెంటర్ తడిసి ముద్దైంది. నాడు కర్బలా మైదానంలో వీర మరణం పొందిన ఇమామ్ హుస్సేన్ ఆయన అనుచరుల అమర త్యాగాలను జ్ఞప్తి తెచ్చుకుంటూ నగరంలోని పెద్ద, చిన్న పార్టీలకు చెందిన ముస్లింలు ఆదివారం మొహర్రం సందర్భంగా రక్త తర్పణ చేశారు. మొహర్రం దుఃఖదినాల్లో 11వ రోజున వచ్చిన మొహర్రం సందర్భంగా ముస్లింలు పంజాల్లోని పీర్లను ఊరేగిస్తూ కోనేరుసెంటర్‌కు చేరుకుని చేతి వేళ్లలో బ్లేడ్‌ముక్కలు ఉంచి గుండెలపై కొట్టుకుంటూ, చాకులతో మీపుపై కొట్టుకుంటూ రక్తం చిందిచి అమరులను గుర్తు చేసుకున్నారు. గిరోహే మీరస్ షా (పెద్దపార్టీ) ఆధ్వర్యంలో పిన్నా, పెద్దా తేడాలేకుండా ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో మాతమ్ నిర్వహించారు. పెద్దపార్టీ హెడ్ మాన్ మీర్ హసన్ అబ్బాస్ నాయకత్వం వహించగా అధ్యక్షుడు మీర్ ఇనాయత్ హుస్సేన్ అల్ హుస్సేనీ పర్యవేక్షణలో మాతమ్ నిర్వహించారు. యా హుసేన్.., లబ్బైక్ యా హుసేన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో కోనేరుసెంటర్ హోరెత్తింది. కోనేరుసెంటర్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న ముస్లింలు హుస్సేన్ అలైహిస్సలాం త్యాగాన్ని తలుచుకున్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) మాతమ్ చేస్తున్న ముస్లింలకు ఏర్పడిన గాయాలపై నీళ్లు చల్లుతూ సపర్యలు చేశారు. అలాగే మాతమ్‌లో పాల్గొని నీరసానికి గురైన వారికి వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యుడు, కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని పేర్ని కిట్టు, కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు, పార్టీ నాయకులు గాజుల భగవాన్, బుర్రా రాజా తదితరులు పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు పర్యవేక్షణలో నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. వందలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కోనేరుసెంటర్‌లో ట్రాఫిక్‌ను మళ్లించారు.



మచిలీపట్నంలో మాతమ్ నిర్వహిస్తున్న ముస్లింలు

మచిలీపట్నంటౌన్: మొహర్రం దుఃఖదినాల్లో భాగంగా మాతం జరిగిన కోనేరుసెంటర్‌లో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.ఫణికుమార్, ఉపాధ్యక్షుడు ఐ.సుధాకర్, కోశాధికారి కె.మణిబాబు, సభ్యుడు టి.నరేష్ పర్యవేక్షించారు.

చల్లపల్లి: మొహర్రం పర్వదినాన్ని ఆదివారం చల్లపల్లిలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పడమరవీధిలో, ఇస్లాంనగర్‌లో ఉన్న పీర్ల పంజాను ప్రత్యేకంగా అలంకరించి గంధం, ధుని సమర్పించారు. యువకులు పీర్లను ప్రధాన రహదారుల వెంబడి ఊరేగించారు. షర్బత్, మరమరాలు, పప్పు బెల్లాలు సమర్పించారు.

గూడూరు: కర్బలా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గూడూరు మండలంలోని ముస్లింలు ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన గూడూరులోని బారా ఇమామ్ పంజాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. హజ్రత్ నాల్ సాహెబ్, నకర్ అలీ పంజా, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా షర్బత్ పంపిణీ చేశారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్



పెడన: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెడన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత యాంటి రేబిస్ వ్యాక్సిన్‌ను 85 పెంపుడు జంతువులకు వేసినట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కొనకళ్ల బాబురావు అన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగిందన్నారు. పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే లక్ష్యంతో వ్యాక్సిన్ వేయించాలన్నారు.

మోపిదేవి: పెంపుడు కుక్కలకు ప్రతి సంవత్సరం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి అన్నారు. మండలకేంద్రం మోపిదేవి వెటర్నరీ వైద్యశాలలో డాక్టర్ నందకిషోర్ ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా 50 పెంపుడు కుక్కలకు ఆదివారం వ్యాక్సిన్ అందించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి వరప్రసాద్, నందిగం అభిషేకరావు, వెటర్నరీ సిబ్బంది సుధాకర్, దివ్యభారతి పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. నగరంలోని కుక్కలు, పిల్లులు పెంపకందారులు వాటిని తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం



శ్రీకాకుళంలో సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, నేతలు

చిట్టూర్పు(ఘంటసాల): ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి నెమలకంటి శ్రీలక్ష్మీ కృష్ణవేణి సేవలు అభినందనీయమని సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు అన్నారు. చిట్టూర్పు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆమె బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ కృష్ణవేణిని సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత దాసరి బసవకుటుంబరావు, టీడీపీ నేత గుత్తికొండ ప్రసాద్, వీటీఏ వంపుగోళ్ల రజని సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయం, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం సచివాలయంలో బదిలీపై వెళ్తున్న ఫణి, దయాన, పద్మ, ప్రతిమలను సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాసరావు, జనసేన నేతలు కొండవీటి నాని, కొండవీటి కోటి సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు స్థానిక కాంతి కేంద్రంలో కలిసి సందడి చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ వ్యక్తిగతంగా తమ తమ వృత్తి ఉద్యోగ, వ్యాపారాలను తెలియజేసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. వచ్చే సంవత్సరం నిర్వహించే సమ్మేళనంలో తోటి స్నేహితులు, విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, విశ్వనాథ్, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, రామకృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయానికి విరాళాల అందజేత

మోపిదేవి: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి రేపల్లె వాస్తవ్యులు డి.రాము, ఝాన్సీరాణి దంపతులు దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రూ.10,116లు, గోశాలలో గడ్డి నిమిత్తం రూ.10,116 విరాళం అందించారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళాలను అందజేశారు.

వాటర్ జగ్గుల వితరణ

అశ్వరావు పాలెం గ్రామస్తులు పంద్రాజు నాగేశ్వరావు జ్ఞాపకార్థం వారి కుమారులు పంద్రాజు వెంకటసాయి శివరావు వాటర్ జగ్గులు 12, ఇదే గ్రామానికి చెందిన తిమ్మన విజయలక్ష్మి జ్ఞాపకార్థం పంద్రాజు నాగ వెంకట సాంబశివరావు, దుర్గా రాధిక వాటర్ జగ్గులు 12, కొత్తపేట వాస్తవ్యులు దేవనబోయిన రేణుకయ్య జ్ఞాపకార్థం వారి కుమార్తెలు దివ్య వెంకట కుమారి, నిశాంత్ కుమారి వాటర్ గ్లాసులు 400 మొత్తం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. దాతల కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



ఆలయ డీసీ వరప్రసాదరావుకు విరాళం అందజేస్తున్న రాము, ఝాన్సీరాణి దంపతులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు



మల్కాపట్నంలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

కోనేరుసెంటర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత తొలి ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, గాజుల భగవాన్, చలమలశెట్టి గాంధీ, కె.శరత్, దళిత సంఘాల నాయకులు జక్కుల ఆనంద్, బూరగ రామారావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు యెగ్గోని గాంధీ పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మల్కాపట్నంలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబూజగ్జీవన్‌రామ్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడెల్లి మరియకుమార్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, నాయకులు శీనయ్య మాస్టార్, కొడాలి అజయ్ కుమార్, బందారు వెంకటేశ్వరరావు, మట్టా జయప్రకాష్, కొల్లూరి లలితరాజు, కొడాలి యోహాను, బందారు చిన సోమేశ్వరరావు, ముప్పిడి కోటేశ్వరరావు, న్యాయవాది గురిందపల్లి విజయబాబు ఉన్నారు.

9న సమ్మెను విజయవంతం చేయాలని ర్యాలీ

బంటుమిల్లి: దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ చేసిన జీవోలకు నిరసనగా చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రెండు మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ర్యాలీ జరిగింది. సీఐటీయూ రైతు సంఘం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల కార్నియాలు సేకరణ



నాగ పుష్పావతి (ఫైల్)



కొక్కిలిగడ్డ చంద్రమ్మ(ఫైల్)

నాగాయలంక: నాగాయలంక మండల పరిధిలో ఆదివారం మృతిచెందిన ఇద్దరి కార్నియాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. గ్రామంలోని రెండో వార్డుకు చెందిన తలశిల నాగపుష్పావతి(70) అనారోగ్యంతో ఆదివారం మరణించగా ఆమె నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆమె కుమారుడు రవి, కుమార్తె పద్మ, ఇతర కుటుంబ సభ్యులు నేత్ర దానానికి స్వచ్ఛందంగా ముందు కొచ్చారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నిషియన్ సాయి బృందం కార్నియాలను సేకరించారు.

పెదకమ్మవారిపాలెంలో..

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని ఏడో వార్డు నివాసితురాలు కొక్కిలిగడ్డ చంద్రమ్మ(75) ఆదివారం మరణించగా ఆమె నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేవారు. మృతురాలి కుమార్తె సీతామహాలక్ష్మి, కుటుంబ సభ్యులు నేత్ర దానానికి స్వచ్ఛందంగా ముందు కొచ్చారు. తమ సంస్థ మోటివేషన్‌తో నేత్ర దానాల సంఖ్య 239కి చేరిందని సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ చెప్పారు.

వేములపల్లిలో చెత్త తొలగింపు

వేములపల్లి(ఘంటసాల): మండల పరిధిలోని వేములపల్లి గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ పర్యవేక్షణలో ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఈవో సురేష్ మాట్లాడుతూ వేములపల్లి బస్టాండ్ ప్రధాన రహదారి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు సుమారు 2 కి.మీ.ల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలు, తాటాకు గుట్టలు, చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయిందన్నారు. దీంతో రోడ్డును ఆక్రమించుకుని వేసుకున్న చెత్త చెదారాన్ని పొక్లెయిన్‌తో తొలగించి ట్రాక్టర్లతో బయటకు తరలించినట్లు తెలిపారు. గ్రామ ప్రముఖుడు సూర్యదేవర సాంబశివరావు సహకారం అందించారు. పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఈవో సురేష్

చల్లపల్లిలో గురుపూజోత్సవం

చల్లపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చల్లపల్లి ఖండ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన కృష్ణాజిల్లా ప్రచారక్ శ్రీనాథ్, కృష్ణాజిల్లా సర్ సంచాలక్ కోనేరు బలరామ్, ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ వరదా హరిగోపాల్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది విజయదశమికి చల్లపల్లి ఖండలో జరిగే సంఘ్ జయంతి నగర సంచాలన్ కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చల్లపల్లి స్వయం సేవక్ సంఘ్ సభ్యులు భూమా భవాని, బోలెం మునేష్, తాతా రెడ్డి, ఈశ్వర్, యశ్వంత్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.